క్లుప్తంగా

చైతన్యను కలిసిన పీడీసీసీ బ్యాంకు చైర్మన్


ప్రసాదరెడ్డిని పూలమాలతో సత్కరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యను శనివారం ప్రకాశం జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ ప్రసాదరెడ్డి మార్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను చైతన్య శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గజ్జల జగన్‌మోహన్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ దేశు పద్మేశ్, సందిరెడ్డి రమేశ్, మణికేశ్వరం సొసైటీ అధ్యక్షుడు సోమా శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం


నరసింహారావు దంపతులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ మాజీ అధ్యక్షుడు సీఎల్‌వీ నరసింహారావు వివాహ దినోత్సవం సందర్భంగా శనివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి శింగరకొండలోని శ్రీరామ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు మలాది శ్రీనివాసరావు, కోశాధికారి కొల్లా భువనేశ్వరీ, మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, యు. దేవపాలన, మన్నం త్రిమూర్తులు, షేక్ మహమ్మద్ రఫీ, అళహరి హరిప్రసాద్, బీఎస్ పూర్ణచంద్రరావు, ఉరిటి శ్రీనివాసరావు, షేక్ అంజాద్‌బాషా, తమ్మన శ్రీనివాసరావులు నరసింహారావు దంపతులను దుశ్శాలువాలతో సత్కరించారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు అడ్డుకట్ట


ట్రాఫిక్ నియమాలను వివరిస్తున్న ఒన్‌టౌన్ సీఐ శేషగిరిరావు

చీరాల: వాహనాలు నడిపేవారు విధిగా ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చని ఒన్‌టౌన్ సీఐ ఎం .శేషగిరిరావు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలో 'నో యాక్సిడెంట్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ శేషగిరిరావు, ట్రాఫిక్ ఎస్సై గోపి, సిబ్బందితో కలిసి పట్టణంలోని ప్రధాన వీధులైన గడియార స్తంభం సెంటర్, మార్కెట్ సెంటర్, ముక్కోణం పార్కు కూడలి, రైల్వేస్టేషన్ రోడ్డు, బస్టాండ్ కూడలి, ఆర్వోబీ ప్రాంతాల్లో వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే వారు విధిగా హెల్మెట్లు ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపరాదన్నారు. కార్లు నడిపే వారు తప్పకుండా సీట్‌బెల్ట్ ధరించే వాహనాలు నడపాలన్నారు. మితిమీరిన వేగం, ట్రిపుల్ రైడింగ్, అదనంగా ప్రయాణికులు ఎక్కించుకోకుండా ఆటోలు నడపాలని డ్రైవర్లకు సూచించారు. సీఐతో పాటుగా సివిల్, ట్రాఫిక్ పోలీసులు, వాహనాల డ్రైవర్లు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి


సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

చీరాల టౌన్: గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన వికసిత్ భారత్ అద్భుతమని హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని కావూరివారిపాలెం, ఈపురుపాలెం గ్రామ పంచాయతీల్లో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీల గురించి వివరించారు. వికసిత్ భారత్ లక్ష్యాలతో పాటుగా కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సుబ్బారావు, పంచాయతీల సెక్రటరీలు వెంకటేశ్వరరావు, ఇమ్రాన్, వీఆర్వో యోగానంద ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో, పలు శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అన్ని విధాలా అన్నదాతలను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి
- పలు పంటల పరిశీలన


నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల టౌన్: పంటలు దెబ్బతిన్న రైతులు అధైర్యపడకండి.. చీరాల నియోజకవర్గంలో మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన అన్నదాతలను అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి రైతులకు భరోసా కల్పించారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. మండలంలోని బోయినవారిపాలెం, దేవినూతల, కావూరివారిపాలెం, తోటవారిపాలెం, బుర్లవారిపాలెం గ్రామాల్లో తుఫాన్ కారణంగా నీటమునిగిన పంట పొలాలను పరిశీలించి రైతులతో ఎమ్మెల్యే మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వరి, మినుము, మొక్కజొన్న పంట పొలాలు నీటమునిగాయని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. త్వరలోనే రైతులను ఆదుకుంటామని వారికి ధైర్యం చెప్పారు. చీరాల ప్రాంతంలో పంట నష్టపోయిన రైతుల వివరాలు, అంచనాలను సిద్ధం చేయాలని ఏడీఏ ఎప్రాయంకు ఎమ్మెల్యే సూచించారు. అలానే ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న చీరాల ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డిని కావూరివారిపాలెం వెళ్లి పరామర్శించారు. అధైర్యపడొవద్దని త్వరగా కోలుకుంటావని రమణారెడ్డికి ఎమ్మెల్యే కరణం ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాస్, రూరల్ పార్టీ అధ్యక్షుడు అంకాళరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బి.కేశవులు, జేసీఎస్ కన్వీనర్ బి.సాంబశివరావు, పార్టీ నాయకులు బి.శ్రీనివాసరావు, యదలారెడ్డి, శ్రీను. ప్రసాద్, సురేష్, కోటేశ్వరరావు, పోలయ్య, ఏసురత్నం తదితరులు ఉన్నారు.

రబీ పంటలకు ఈ–క్రాప్ తప్పనిసరి..

జే.పంగులూరు: ఈఏడాది రబీ సీజన్‌లో అక్టోబర్ 10 నుంచి సాగు చేసిన అన్ని రకాల పంటలను ఈ క్రాప్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి రైతులను కోరారు. తుఫాన్ కారణంగా మండల పరిధిలోని దెబ్బతిన్న పంటను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టపోయిన, ఉచిత పంటల బీమా వర్తింపజేయాలన్నా, పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్ముకోవాలన్నా, సున్నా వడ్డీ రాయితీ పొందాలన్నా, తప్పనిసరిగా రైతులు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు. రైతు భరోసా కేంద్రాధికారిని సంప్రదించి వెంటనే పంట నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. తుఫాన్ కారణంగా మండలంలో మొక్కజొన్న 90 ఎకరాలు, వరి 546, మినుము 497, శనగ 2650, పొగాకు 1150, మిర్చి 945 ఎకరాల్లో పంట నష్ట జరిగిందని తెలిపారు.


బుర్లవారిపాలెంలో రైతులకు ధైర్యం చెప్తున్న ఎమ్మెల్యే కరణం


పంగులూరులో శనగ పంటను పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

రాజీమార్గంతో కేసుల పరిష్కారం

- సీనియర్ సివిల్ జడ్జి సుధ
- జాతీయ లోక్ అదాలత్‌లో 181 కేసుల పరిష్కారం


పర్చూరు లోక్ అదాలత్‌లో కేసులు విచారణ చేస్తున్న జడ్జిలు

చీరాల రూరల్: లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకుంటే డబ్బుతో పాటు సమయం ఆదా అవుతుందని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ పురస్కరించుకుని శనివారం స్థానిక కోర్టు భవన సముదాయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కక్షిదారులకు ఉచిత న్యాయసాయం అందించనున్నట్లు చెప్పారు. మహిళలు, దీర్ఘకాలిక రోగులు, చిన్న పిల్లలు, వృద్ధులు, మూడు లక్షలు వార్షికాదాయం కలవారు ఉచిత న్యాయ సాయానికి అర్హులని తెలిపారు. ప్రజలకు అవసరమైన అనేక చట్టాలను గురించి న్యాయమూర్తి వివరించారు.

181 కేసులు పరిష్కారం..

కోర్టు భవన సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 181 కేసులు పరిష్కరించారు. మూడు బెంచ్‌లుగా ఏర్పాటు చేసిన అదాలత్‌లో క్రిమినల్ కేసులు 113, చెక్‌బౌన్స్ కేసులు 5, భరణం కేసు 1, మద్యం కేసులు 34, పీఎల్సీ కేసులు 7, సివిల్ కేసులు 6, ఈపీ కేసులు 2, సీసీ కేసులు 12 పరిష్కరించారు. జాతీయ అదాలత్‌కు ప్రిసైడింగ్ అధికారులుగా న్యాయమూర్తులు ఎం. సుధ, షేక్ రెహాన, షేక్ నిషాద్ నాజ్, బెంచ్ మెంబర్లుగా న్యాయవాదులు శ్రీకాంత్ ఠాకూర్, కె. వాసుబాబు, ఎ. విశ్వేశ్వరరావు, స్నేహ, పీఎల్వీలు ఎస్డీ. మతీన్, డీ ఇమ్మానియేలు వ్యవహరించారు. కార్యక్రమంలో పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 85 కేసులు రాజీ

పర్చూరు (చినగంజాం): జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా పర్చూరులో శనివారం రెండు బెంచ్‌లుగా లోక్ అదాలత్ నిర్వహించి 85 కేసులను రాజీ చేశారు. మొదట బెంచ్ ప్రిసైడింగ్ అధికారిగా పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి కే ప్రశాంతి, బెంచ్ సభ్యులుగా న్యాయవాదులు సిహెచ్ శ్రీరమణి, కే ధనలక్ష్మి వ్యవహరించగా, బెంచ్ 2 ప్రిసైడింగ్ అధికారిగా పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి పీ శాంతి, బెంచ్ సభ్యులుగా న్యాయవాదులు కే రమేష్ బాబు, టీ రాజేష్‌లు వ్యవహరించారు. 2 సివిల్ కేసులు రూ 2.06, లక్షలు, 2 చెక్ బౌన్స్ కేసులు రూ 3.30 లక్షలు, 23 ఎక్సైజ్ కేసులు, 28 క్రిమినల్ కేసులు, 25 బ్యాంకు ప్రి లిటిగేషన్ కేసులు రూ 18.10 లక్షలు, 5 పీఎల్‌సీ శాశ్వత భరణం కేసులు రూ 32,.18 లక్షలకు రాజీలు కుదుర్చుకున్నట్లు మండల లీగల్ సెల్ సీనియర్ అసిస్టెంట్ తెలిపారు.

ప్రారంభానికి ముస్తాబైన సామాజిక భవనం


ముస్తాబైన సామాజిక భవనం

బల్లికురవ: బల్లికురవలోని ఎస్సీ కాలని (మాలపల్లె) రూ.18 లక్షలతో నిర్మించిన సామాజిక భవనం ప్రారంభానికి ముస్తాబైంది. ఎస్సీ కాలని వాసులు ఈఏడాది జనవరిలో సామాజిక అవసరాలకు భవనం లేక అవస్థలు పడుతున్నామని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యకు, మండల పార్టీ అధ్యక్షుడు చింతల పేరయ్యకు విన్నవించారు. వెంటనే చైతన్య జిల్లా పరిషత్ నిధుల్లో రూ. 15 లక్షలు మంజూరు చేయించారు. పంచాయతీరాజ్ ఏఈ జీ. హనుమంతరావు పర్యవేక్షణలో మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ శ్రీనువలి పనులను చేపట్టి సకాలంలో పూర్తిచేశారు. తుదిదశ పనులకు నిధులు చాలకపోవటంతో మండల నిధుల్లో రూ.3 లక్షలు కేటాయించారు. ఎంతో సువిశాలంగా సర్వాంగ సుందరంగా భవనాన్ని నిర్మించారు. మాసాంతంలో భవనాన్ని కృష్ణచైతన్య చేతుల మీదుగా ప్రారంభిస్తామని శ్రీనువలి తెలిపారు.

జగనన్నను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారు


గ్రామస్తులతో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- గడప గడపలో శాప్‌నెట్ చైర్మన్

అద్దంకి: రాబోయే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం మండలంలోని ధేనువుకొండ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వాల పనితీరు బాగుందో లేదో ప్రజలే నిర్ణయిస్తారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు నీరాజనాలు పడుతున్నారంటే ఈప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పాలన నచ్చడం వల్లేనని స్పష్టం చేశారు. గడప గపడను సందర్శించి ఆకుటుంబంలోని వారికి ఏఏ పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో తెలిపే పత్రాలు పంపిణీ చేశారు. వారి నుంచి ప్రభుత్వ పనితీరు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పదవీ కాలాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకోబోతోందన్నారు. ఇచ్చిన వాగ్దానాలను మించి పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరలా గెలవడం ఖాయమన్నారు. ప్రజలంతా తమ ఓట్లతో మరలా ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గుజ్జుల జగన్ మోహన్‌రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ నాయకుడు రామిరెడ్డి ఆదిరెడ్డి, నాయకులు కొంచా శ్రీనివాసరెడ్డి, నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా యూత్ కాంపిటీషన్స్

చీరాల రూరల్: స్థానిక జాన్‌పేటలోని సెయింట్ జాన్స్ ప్యారిష్ చర్చిలో శనివారం యూత్ కాంపిటీషన్స్ ఎంతో ఘనంగా నిర్వహించారు. ముందుగా చర్చి పాస్టర్ గోదా చంద్రకాంత్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చీరాల, పరిసర ప్రాంతాలకు చెందిన లూథరన్ చర్చిలకు సంబంధించిన యువతీ, యువకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. బైబిల్ గ్రంథంలోని అనేక ఘటనలపై పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీలు, వ్యాసరచన పోటీలు, దేవుని గీతాలపనలు, దేవుని గీతాలకు నృత్య పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

ద్రోణాదులలో కార్తీక వన సమారాధన


ప్రత్యేక పూజల్లో ఆలయ అర్చకులు

మార్టూరు: మండలంలోని ద్రోణాదుల తరుణాచల ప్రాంతంలో భక్తులు వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక సోమేశ్వర ఆలయంలో భక్తులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు శివుడికి అన్నాభిషేకం

బల్లికురవ: కార్తీక మాసం సందర్భంగా ఆదివారం చిన అంబడిపూడి గ్రామంలోని గంగాపార్వతిదేవి సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శివునికి అన్నాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్నామని, పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలని అర్చకులు పీ. లక్ష్మీ వరప్రసాదరావు, ధర్మకర్త గంగవరపు వెంకటేశ్వర్లు తెలిపారు.

వికసిత్ భారత్‌తో గ్రామాభివృద్ధి


కొణిదెనలో గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

బల్లికురవ: వికసిత్ భారత్ సంకల్పయాత్రలతో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను ప్రజలకు తెలియజేస్తు గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుంటున్నట్లు కో ఆర్డినేటర్ పోలవరపు అనుప్రసాద్ తెలిపారు. శనివారం కే రాజుపాలెం, కొణిదెన గ్రామాల్లో సంకల్పయాత్రలు నిర్వహించారు. దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని చెప్పారు. ఈయాత్రలో భాగంగా ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఉజ్వలా యోజన గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై టెలీ ఫిలిం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో బ్రహ్మయ్య, సెక్రటరీలు ప్రసాద్, సీతామహాలక్ష్మీ, స్థానిక నేతలు అమర్నేని రమేష్, విష్ణు, అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌టీపాడు, బల్లికురవలో వికసిత్ యాత్రలు

వికసిత్ భారత్ సంకల్పయాత్రలు ఆదివారం ఉదయం నక్కబొక్కలపాడు, మధ్యాహ్నం బల్లికురవలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య శనివారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై అవగాహనతోపాటు గ్రామాల్లోని ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు యాత్రలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల స్థాయి అధికారులు, గ్రామాల్లోని ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పంటలను ఆదుకోవాలని వినతి

- సీఎం జగన్‌కు ఎమ్మెల్యే కరణం వినతి


కరణం బలరాం, ఎమ్మెల్యే, చీరాల

చీరాల: నియోజకవర్గంలో మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా విన్నవించినట్లు ఎమ్మెల్యే కరణం బలరాం శనివారం పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు శుక్రవారం సీఎం జగన్ మోహన్‌రెడ్డి కర్లపాలెం వచ్చిన సందర్భంగా ప్రత్యేక వినతి పత్రం అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించి తప్పకుండా ఆదుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారన్నారు. అంతేకాకుండా వెంకటేష్ ఆరోగ్య పరిస్థితిపై జగన్ ఆరా తీశారని చెప్పారు. జరిగిన ప్రమాదంపై ఎమ్మెల్యే కరణం బలరాం సీఎంకు వివరించారు. ప్రమాదం జరిగిన తీరు, శస్త్ర చికిత్స గురించి అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని చెప్పారన్నారు. అధైర్య పడవద్దని తాను అండగా ఉన్నానని ఎమ్మెల్యే కరణం బలరాంకు సీఎం అభయం ఇచ్చారు. వైఎస్సార్ సీపీని బలోపేతం చేసి విజయమే లక్ష్యంగా పనిచేసేలా పార్టీ క్యాడర్‌ను సిద్ధం చేయాలని, ప్రభుత్వ పథకాలను, అందిస్తున్న చేయూతను గురించి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యేకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎప్పుడు అండగా మీకు ఉన్నానని ఎమ్మెల్యేకు సీఎం జగన్ హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం


కషాయాల తయారీ విధానం చూపుతున్న రిసోర్స్ పర్సన్

పర్చూరు (చినగంజాం): ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు ఖర్చు తక్కువ, ఆదాయం పెంచుకొనే వీలుందని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ సోనియా రైతులకు సూచించారు. శనివారం మండలంలోని నాగులపాలెం గ్రామంలో ఐసీఆర్‌పీ బీ సోనియా డ్వాక్రా మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చు తగ్గించుకొని ఆదాయం పెంచుకోవచ్చని తద్వారా వివిధ రకాల కషాయం, ద్రవాలు తయారు చేసుకొని వాడుకోవచ్చని తెలిపారు. వీటి ద్వారా అన్ని రకాల పెద్ద పురుగులు, లద్దె పురుగులు, కత్తెర పురుగులను నివారించే అగ్ని అస్త్రం తయారు చేసుకొని వాడుకోవడం ద్వారా పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు. డ్వాక్రామహిళా రైతులకు వాటిని తయారు చేసే విధానం, వాటి ఉపయోగాలు తెలియజేశారు.

నగరేశ్వరాలయంలో చైతన్య పూజలు


పూజలు చేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ చైతన్య

అద్దంకి: విద్యా వాసవీ సమేత నగరేశ్వర ఆలయంలో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వాములు ఏర్పాటు చసిన పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం పూలమాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆశీర్వచనం ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దేశు పద్మేశ్, కౌన్సిలర్ బాలూ స్వామి, భువనేశ్వరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

171 కేసులు పరిష్కారం

అద్దంకి రూరల్: అద్దంకి కోర్టు భవనాల సముదాయంలో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయలోక్ ఆదాలత్‌లో 171 కేసులు పరిష్కారించినట్లు సీనియర్ సివిల్ జడ్జి బీ. బాబునాయక్ వెల్లడించారు. వీటిలో క్రిమినల్ కేసులు 146, సివిల్ కేసులు 17, వివాహ సంబంధిత కేసులు 5, చెక్‌బౌన్స్ కేసులు 3 పరిష్కరించారు. పరిష్కరించిన కేసుల కక్షిదారులకు వెంటనే సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం బుజ్జప్ప, న్యాయవాదులు పాల్గొన్నారు.

అల్పాహార వితరణ అభినందనీయం

చీరాల అర్బన్: నేతాజీ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. శనివారం స్థానిక పేరాల చిన్న రథం సెంటర్ వద్ద నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు అల్పాహార వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నేతాజీ సేవా సమితి అధ్యక్షులు చుండూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ జనవరి 23న నేతాజీ 127 వ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి పవని భానుచంద్రమూర్తి, అన్నంరాజు సుబ్బారావు, మంతెన మణిబాబు పాల్గొన్నారు.


అల్పాహారాన్ని అందిస్తున్న సభ్యులు

స్కావెంజర్స్ జిల్లా కమిటీ సభ్యురాలిగా సరళ


నక్కా దెబోరా సరళ

అద్దంకి రూరల్: అద్దంకికి చెందిన నక్కా దెబోరా సరళను బాపట్ల జిల్లా విజిలెన్స్ కమిటీ ఫర్ ప్రొహిబిషన్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ మాన్యువల్ స్కావెంజర్స్ కమిటీ సభ్యురాలుగా నియమించినట్లు శనివారం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషానుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నక్కా కాంతారావు అభినందించారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం పనిచేయాలని కోరారు.

16 నుంచి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం పంచాయతీలోని స్ట్రయిట్‌కట్ సమీపంలోని వీరహనుమాన్ నగర్‌లో నూతనంగా నిర్మాణం చేసిన 63 అడుగుల అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను ఈనెల 16 నుంచి 18 తేదీ వరకు నిర్వహిస్తున్నామని వీరహనుమాన్ సేవా సమితి ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 16 నుంచి 18 వరకు నిర్వహించనున్న నూతన అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరపూజ, పంచగవ్య ప్రాసన, అఖండ స్థాపన, వాస్తు హోమం, హోమాలు, గ్రామోత్సవం, ప్రతిష్ఠనంతరం అన్నప్రసాద వితరణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా 17 తేదీ సాయంత్ర నాట్య విశారద కోకా విజయలక్ష్మీ శిష్యబృందంతో కూచిపూడి నాట్య ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని కమిటీ వారు తెలిపారు. ఈ వేడుకలకు అధికసంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకోవాలని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

